

# ఇది ఇంతే!

"ఏమండీ! అత్తగారు లేకపోతే, ఈ పిల్లల్తో, వీళ్ళ స్కూళ్ళతో; మీతో, మీ ఆఫీసుతో, పనితో, పనిమనిషితో ఒక్కర్తినీ చేసుకోలేక ఛస్తున్నాను. వెళ్ళి అత్తయ్యని తీసుకురండి. అయినా కోపం వచ్చి అలా కూతురింట్లో ఎన్నాళ్ళుంటారు? అప్రతిష్ఠ! ఇప్పటికే వెళ్ళి నెల రోజులైంది" అని మా ఆవిడ పోరగా ఓ శనివారం మా చెల్లెలుగారి ఊరు బయలుదేరాను.

రిక్షా డబ్బులిచ్చి, లోపలికి అడుగుపెడుతున్న నాకు, మా చెల్లెలి గొంతు వినిపించింది. "నీతో చెప్పలేక ఛస్తున్నానమ్మా! నీకెందుకా పనులసలు? నా చావు నేను ఛస్తాగదా! నువ్వు నోరు మూసుకుని కూర్చో చాలు. నాకేం సాయం చెయ్యక్కర్లేదు."

"మామయ్యొచ్చాడు - మామయ్యొచ్చాడు" అని కాళ్ళ కడ్డంపడ్డ మేనల్లుడ్ని, మేనకోడల్ని ఎత్తుకుని లోపలికి అడుగుపెట్టాను.

"ఒరేయ్ పాయి! సమయానికి వచ్చావు. ఇది చూడరా నన్నెలా తిడుతోందో! తక్షణం మన వూరు పోదాం పద. కోడలు ఎన్ని విసుక్కున్నా యిలా తిట్టదు" మా అమ్మ.

వెంటనే మా చెల్లెలు అందుకుంది? "వెడితే వెళ్ళు! సగం పీడ వదులుతుంది. పెద్దదానివయ్యావు. నీకెందుకమ్మా అంటే ప్రతిదీ నీకే కావాలి! ఒదినతోనూ ఇలాగే చేస్తూ వుండి వుంటావు. కోడలు కాబట్టి తిట్ట లేక విసుక్కుంటూ వుండి వుంటుంది.

నాకు హఠాత్తుగా నవ్వొచ్చింది. "అమ్మా! నీకు గుర్తుందా? ఒక రోజున అమ్మమ్మ ఆవకాయ జాడీ దింపబోయి కాలిమీద వేసుకుంది ఆవిడ కాలూ చితికింది, జాడీ పగిలింది.



అవకాయా పోయింది. ఆ రోజున నువ్వేమన్నావు? ఈవిడ ఛస్తే దుర్గామ్మవారికి పది కొబ్బరికాయలు కొడ్తానన్నావు - గుర్తుందా?"

"అన్నాన్రా నాయనా! అన్నాను. బుద్ధిలేక. తరువాత పెద్దదిక్కు లేదే అని ఏడ్చాను కూడా! ఊరికే మీ సొమ్ము తింటూ కూర్చోవాలంటే మనసొప్పక ఏదో చేతనైన సాయం చేద్దామని ఇంతకాలం చేసీ చేసీ హఠాత్తుగా మూల కూర్చోమంటే! మీకేం మీరంటారు. మాకెట్లా కుదుర్తుందిరా" పాపం బాధపడింది మా అమ్మ.

"సరిలే! అమ్మమ్మా ఈ మాటే అనేది. అప్పుడు నువ్వన్న మాటలు కాస్త గుర్తుతెచ్చుకో పెద్దవాళ్ళయిన తరువాత కొన్ని పనులు మానెయ్యాలి. చిన్నతనంలో వున్న ఓపిక యిప్పుడుందా నీకు?" అంది మా చెల్లెలు.

"అమ్మా! నేను చూడనుగాని, పెద్దయితే మీరూ యింతే". మా అమ్మ గొంతులో బాధ, వ్యంగ్యం.

"ఏమన్నా అంటే ఇదొకటి, అయితే అవుతాంలే కాని, అక్కడికెళ్ళి వదిన ప్రాణం తీయకు. సర్లేరా అన్నయ్యా! నువు కాళ్ళు కడుక్కో, మీ బావగారు వచ్చే వేళయింది." మా చెల్లెలి కన్‌క్లూషన్.

"నాకు తెలుసు. ఇది మామూలే! మా అమ్మమ్మ - మా అమ్మ - మేమూ ఇంతేనేమో! ఏమో కాదు, శతవిధాల ఇంతే.